
# ఇలాంటి అమ్మాయిలెందరో!

- డి.కామేశ్వరి




"ఆంటీ! సెకండ్‌ఫ్లోర్ 201లో ఒక అమ్మాయి కొత్తగా వచ్చింది. చూశారా?" అంది పక్కింటి రోష్ని. "ఎవరు? ఎవరొచ్చారు, కొత్తగా వచ్చారా! నేను చూడలేదే" అన్నాను.

"అదిగో, అదిగో అక్కడ నిల్చుంది చూడండి ఒకసారి" అంది రోష్ని. నేను కుతూహలంగా రేలింగ్ దగ్గరకి వెళ్ళి కిందకి చూశాను. మా అపార్ట్‌మెంట్స్ డిజైన్ గుండ్రంగా ఒక నుయ్యి ఆకారంలో వుండి ఏ యింటి నుంచి చూసినా అన్ని యిళ్లు కనిపిస్తాయి. మధ్య రేలింగ్ దగ్గిర నిలబడితే మొత్తం యిళ్లన్నీ కనిపించేట్లు వుంధి. నేను ఫోర్త్ ఫ్లోర్‌లో నిలబడి చూశాను. 202 గుమ్మం దగ్గర ఓ చామన చాయగా, పొట్టిగా పీలగా పంజాబి దుస్తుల్లో వున్న ఒకమ్మాయి నిలబడి వుంది. "ఆంటీ! ఆ అమ్మాయిని చూశారా. ఇందాక లిఫ్ట్‌లో వస్తుంటే చూశాను. ఫ్యామిలీ టైపు అమ్మాయిలా లేదాంటీ" అంది మళ్లీ. ఈ లోగా ఆమె భర్త కూడా మా దగ్గిరకి వచ్చి, "అవునాంటీ, ఆ అమ్మాయి సరి అయిన అమ్మాయి కాదు, మామూలు ఫ్యామిలీ టైపు కాదు" అన్నాడు. మగవాళ్ళకీ విషయాలు మనకంటే బాగా అర్థమవుతాయి.


"అదేంటి, ఎందుకలా అనిపించింది? ఒక్కర్తే వుంటుందా? భర్త, సంసారం ఎవరూ లేరా?" అన్నా ఆశ్చర్యంగా.

"ఏమో ఆంటీ! వేషం మాటా చూస్తే ముస్లిమ్ అనిపించింది. కాని ఒకరితో గుజరాతి అంది, యింకోరితో మార్వాడి అందిట" రోష్ని.

"నిన్న రాత్రి, అర్ధరాత్రి దాటాక ఎవరో యిద్దరు మగవాళ్ళు వచ్చి అడిగారట 202 ఫ్లాట్ ఎక్కడని. వాచ్‌మన్ కొత్తవాళ్ళని చూసి మీరెవరు అంటే ఆ యింటికెళ్ళాలన్నారట. వాచ్‌మెన్ చెప్పాడు వాళ్ళు ఆ యింట్లోకెళ్ళి మళ్ళీ తెల్లారి ఐదు గంటలకి వెళ్ళిపోయారట" అన్నాడు రోష్ని భర్త మనోజ్.

"అదేమిటి. నాకసలు తెలియనే తెలియదు. ఎప్పుడొచ్చిందో అసలు చూడనే లేదు నేను. మరి సామాను అదీ ఏం లేదా?"

"ఏమో ఎవరికి తెలుసు? ఏవో అట్టపెట్టెల్లో కొన్ని సామాన్లు రిక్షాలో తెచ్చిందంటే. ఒకసారి మీరు పిల్చి అడగండి తెలుస్తుంది అసలెవరనీ" అంది మళ్లీ.



## బొమ్మల కొలువు

రారండీ! రారండీ!
పిల్లల్లారా! రారండీ!
అందాలొలికే
బొమ్మల కొలువుకు రారండీ!
॥రారండీ॥

అష్ట బాహుల మహిషాసుర మర్దని
అందమైన అష్టలక్ష్ములు
ఆదివిష్ణువు దశావతారాలు
అందముగా నెలకొన్న బొమ్మల కొలువుకు
॥రారండీ॥

గాంధీ తాత, చాచానెహ్రూ
సుభాస్ చంద్రబోస్, పటేల్
వంటి దేశనాయకు లమరిన
బొమ్మల కొలువుకు రారండీ!
॥రారండీ॥

ఆవు, ఏనుగు, పులి, సింహం,
నక్క, కుక్క, పిల్లి, పక్షి, పాము
సకల జీవుల ఆలయమైన
బొమ్మల కొలువుకు రారండీ!
॥రారండీ॥

చెరువులు, కొండలు, ఏరులు, వాగులు
చెట్లు, పుట్టలు, తోటలు, బాటలు
పువ్వులు, లతలు, కాయలు, పండ్లు
తీర్చిదిద్దిన బొమ్మల కొలువుకు రారండీ!
॥రారండీ॥

భారతమాత కొలువై వుంది
భారతావని సూచిస్తుంది
సమైక్యతని కలిగిస్తుందీ
బంగరు బొమ్మల కొలువుకు రారండీ!
॥రారండీ॥

- ఆర్.ఎస్. హైమవతి

ఆ బిల్డింగులో నా పెద్దరికానికి అంతా కాస్త విలువ యిస్తారు. ముందు నుంచి ఆ బిల్డింగు మంచి చెడ్డలు, అవసరాలు చూడడం ప్రెసిడెంటుగా, సెక్రటరీగా, ట్రెజరర్‌గా చాలా రోజులు పని చేసి, ఆడవాళ్ళకి క్లబ్బు పెట్టి, గేమ్స్, ఏనివర్సిరీడేలు సెలబ్రేట్ చేసి, గణేశ్ పూజలవి చేసి ప్రతి దానిలో నేను ఇంటరెస్ట్ తీసుకుని చేసేదాన్ని. మంచయినా, చెడయినా అంతా నన్ను సంప్రదిస్తుంటారు. నీళ్ళు రాకపోయినా, పని మనుషులు తుడవకపోయినా కేకలు పెడ్తుంటాను.

బిల్డింగు మీద ఇంటరెస్ట్ చూపే ఇద్దరు ముగ్గురిలో నేనూ ఒకరినవడం వల్ల ఆడవాళ్లంతా ఏం జరిగినా నాకు చెప్తుంటారు. అసలు ఆ అమ్మాయి ఎవరో, ఏమిటో తెల్సుకోవాలని చప్పట్లు కొట్టి పైకి రమ్మని పిలిచాను. పైకి వచ్చింది.

"కొత్తగా వచ్చారా? ఎవరు నీవు? ఎక్కడ నుంచి వచ్చారు?" అన్నా హిందీలో కాస్త నవ్వుతూనే పలకరించా. ఎవరో సరిగ్గా తెలియకుండా అమర్యాదగా మాట్లాడడం సభ్యత కాదు కదా! మనిషి చామన చాయ రంగుతో పీలగా, గిడసబారినట్టు వుంది. వయసు ఇరవై దాటదు. మెడలో నల్లపూసల గొలుసు, చేతులకి మెహందీ వుంది. చుడీదార్, కుర్తా వేసుకుంది.

"అవునండీ! ఓల్డ్ సిటీలో వుండేవాళ్ళం. మొన్నే వచ్చాం!" అంది.

"మీవారేం చేస్తారు?" అన్నాను.

ఆ అమ్మాయి నా మొహం వంక చూసి "మాకు ఓల్డ్ సిటీలో డ్రైఫ్రూట్స్ షాపు వుంది" అంది.

పేరేమిటి, షాపెక్కడ అన్నా-ఏదో పేరు చెప్పింది.

"చూడమ్మాయి! నీ పేరేమన్నావు? షాలిని అన్నావు కదూ! ఇక్కడ కొత్తగా అద్దెకు వచ్చినవాళ్లు ఒక నెల అడ్వాన్స్‌గా మెయిన్‌టెనెన్స్ కట్టాలి. మీ ఆయన వస్తే తీసికెళ్ళి, ప్రెసిడెంటుగారిని, సెక్రటరీగారిని కలవమని చెప్పు. ఎవరు ఇల్లు మారారో, కొత్తగా వచ్చారో అసోసియేషన్ వాళ్ళకి తెలియాలి. అంచేత అతన్ని వెళ్లి కలవమని చెప్పు" అన్నాను.

"అలాగే" అంది.

"కొత్తగా పెళ్ళయిందా? ఎక్కడయింది?" మళ్ళీ అడిగా. చేతుల మెహందీ, కొత్తగా మట్టి గాజులు చూసి అడిగా.

"ఆ..మాది గుజరాత్. అక్కడయింది" అంది.

"ఒక్కర్తివే వున్నావు. అత్తవారెవరూ లేరా?" మళ్ళీ ఆరా తీసా.

"మా సాస్‌జీ వాళ్ళు తరువాత వస్తారు" అంది.

"నిన్న రాత్రి ఎవరో ఇద్దరు మగవాళ్లు అర్ధరాత్రి వచ్చారని వాచ్‌మెన్ చెప్పాడు. అలా ఎప్పుడు పడితే అప్పుడు రాత్రి కొత్తవాళ్ళని బిల్డింగ్‌లోకి రానీయం. ఎవరు వాళ్ళు?"

ఆ అమ్మాయి మొహంలో రంగులు మారాయి. కాస్త తడబడి "మా కాకాజీ, చాచాజీ. యిదివరకుండే వారం కదా. అక్కడ మేమంతా పరిచయం" అంది.

"పరిచయం అయితే అలా అర్ధరాత్రి వస్తే తలుపు తీయడు వాచ్‌మెన్. వాళ్లకి చెప్పు" అన్నాను. కాస్త మొహం ముడుచుకుంది. "ముందు రేపు ఆదివారం కదా! మీ ఆయన్ని సెక్రటరీని కలవమని చెప్పు. అడ్వాన్స్ కట్టాలి" అన్నాను.

అపుడు అసలు సంగతి ఏమిటో తెలియకుండా యింకేమనలేక, అంతటితో సరిపుచ్చాను. మొగుడున్నాడో లేడో, సంగతేమిటో తెల్సుకున్నాకే మిగతా విషయాలు చూడొచ్చు అనుకున్నాను.

"చూశారా ఆంటీ! ఆ అమ్మాయి ముస్లిం పిల్లలా లేదు. బొట్టు పెట్టుకొని తయారయిందిగాని ఆ భాష అది గుజరాతీలా వుందా?" అంది రోష్ని.

"ఏమో ఓల్డ్ సిటీలో వుండేవారం అందిగా. అందుకని ఆ భాష పట్టుబడిందేమో. చూద్దాం! నాల్గు రోజులు పోతే సంగతులు తెలుస్తాయిగా" అన్నాను.

* * *

తరువాత మర్నాడు రాత్రి వంటిగంటప్పుడు ఎవరో ఇద్దరు మగవాళ్ళు వస్తే వాచ్‌మెన్ అడ్డుకుంటే గొడవయిందని, వాచ్‌మెన్ వారిస్తున్నా, దురుసుగా అతన్ని తోసి, తిట్టి వాళ్ళు ఆ యింటికి వెళ్లారని తెల్లారి వాచ్‌మెన్ సెక్రటరీకి కంప్లైంట్ ఇచ్చాడు. భర్తని తీసికెళ్ళి పరిచయం చేసి డబ్బు కట్టమన్నా. వచ్చి నాల్గు రోజులయినా భర్తని తీసికెళ్ళలేదు. డబ్బూ కట్టలేదు. సూపర్‌వైజర్‌ని పిలిచి అడిగి పిల్చుకురమ్మంటే మా ఆయన ఊళ్ళో లేడు, వచ్చాక కడ్తాంలే, అని నిర్లక్ష్యంగా అందిట. ఆ రాత్రి ఎనిమిది గంటలకి ఈ అమ్మాయి మిలమిలలాడే బట్టలు, లిప్‌స్టిక్, సెంటులు, మల్లెలు పెట్టుకుని బయటికి వెళ్లి అర్ధరాత్రి ఎవరో మగవాళ్లతో వచ్చిందట. వాచ్‌మెన్ ఆపితే నా ఇంటకి నావాళ్ళొస్తారు. అడగడానికి నువ్వెవరు అని దబాయించిందట. సెకండ్‌ఫ్లోర్‌లో ఆడవాళ్లంతా మాట్లాడుకుని నా దగ్గిరకి వచ్చారు. "ఆంటీ! ఆ అమ్మాయి విషయం చూడండి. మొగుడు లేడు మొద్దులు లేడు, రాత్రిళ్ళు రకరకాల మగాళ్ళు వస్తున్నారంట. నిన్న రాత్రి నేను మా ఆయన సెకండ్‌షో సినిమాకి వెళ్ళి వచ్చేసరికి వాచ్‌మెన్‌తో గొడవపడ్తోంది" అంది

ఒకావిడ పొద్దంతా పడుకుంటుంది. సాయంత్రం ఎనిమిదయ్యాక ముస్తాబయి ఎక్కడికో వెడ్తుంది. మళ్ళీ రాత్రి మగాళ్లతో వస్తుందని వాచ్‌మన్ అన్నాడు" అన్నారిద్దరుముగ్గురు. మావి అరవై ఫ్లాట్‌లు, రాత్రిళ్ళు ఏం జరిగేది మాలా పెందరాడే పడుకునే వారికి తెలియదు కాని ఆలస్యంగా షాపుల నుంచి వచ్చే బిజినెస్‌వాళ్లకి, క్లబ్బులకి వెళ్ళి వచ్చే మగవాళ్లకి తెలుస్తుంది.

అసలు సంగతి వాచ్‌మెన్‌నే అడుగుదాం అని పిలిచా. 'ఏంటమ్మగారూ, అది దొంగముండండి. మొగుడు లేదు, పెళ్లి లేదు. ధంధా పెట్టిందిక్కడ. మేం సెక్రటరీ గార్కి చెప్పాం. ప్రెసిడెంటుగార్కి చెప్పాం. మీరెవరూ పట్టించుకోకపోతే మేం ఏం చెయ్యాలి? మొగుడ్ని చూపించమంటే ఊరెళ్లాడంటుంది. వచ్చిన వాళ్లందరినీ కాకాజీలు, చాచాజీలు, బంధువులు అంటుంది. మేం ఏం చెయ్యాలి?" అన్నాడు.

"ఆంటీ! ఇంట్లో వున్నట్టుంది. మీరు రండి మాట్లాడుదాం. రండి" అన్నారు. నలుగురైదుగురు ఆడవాళ్లం కల్సి వెళ్లి తలుపు కొట్టాం. నిద్రపోతున్నట్టుంది. నిద్రలోంచి లేచి విసుగ్గా తలుపు తీసింది. లోపలకి తొంగి చూస్తే, బెడ్‌రూములో ఓ పెద్ద షోకయిన డబుల్‌కాట్ మంచం, సిల్కు దుప్పటి, రెండు ఫేము కుర్చీలు, వంటింట్లో నాలుగు గ్లాసులు, గిన్నెలున్నాయి. మమ్మల్ని చూసి నవ్వబోయి, మా సీరియస్ మొహాలు చూసి 'ఏమిటి' అంది.

"వారం రోజులయింది నీవు వచ్చి, అడ్వాన్స్ కట్టమన్నా కట్టలేదు. నీ భర్తని పరిచయం చేయి అన్నా చెయ్యలేదు. వాచ్‌మెన్ రోజూ కంప్లైంట్ చేస్తున్నాడు. రోజూ ఎవరెవరో కొత్తమగాళ్ళు వస్తున్నారని" కాస్త సీరియస్‌గానే అన్నాను.

"మా ఆయన ఊర్లో లేడు. వచ్చాక కడ్తాడు" అంది కాస్త నిర్లక్ష్యంగా.

"మీ ఆయన ఊర్లో లేనపుడు ఎవరెవరో మగాళ్లు రాత్రిళ్ళు ఎందుకు వస్తారు?" అంది ఒకావిడ.

"ఏం మీ ఇంటికి బంధువు ఎవరూ రారా?" అంది కాస్త పొగరుగా.

"బంధువులు వస్తారు. యిలా అర్ధరాత్రి రోజుకో మగాళ్ళు రారు. అసలు నీ సంగతి మాకే అర్థం కావడం లేదు. గుజరాతి అంటావు. మార్వాడి అంటావు. అసలు నీకు పెళ్లయిందా? ఏది నీ పెళ్ళి ఫోటోలుంటే చూపించు" అంది మీనా అన్నావిడ.

"ఇక్కడ లేవు. మా అత్తారింట్లో వున్నాయి" తడుముకుంటూ అంది.


"ఒక్క ఫోటో అయినా లేదా? నీవు అబద్ధం ఆడుతున్నావు. నిజం చెప్పు. ఏమిటి ఈ వేషం? ఎవరితోనన్నా పారిపోయి వచ్చావా? అసలు ఈ ఇల్లు కుదిర్చి నిన్నిక్కడ పెట్టింది ఎవరో చెప్పు. వాళ్లతో మాట్లాడుతాం" అని దబాయించాను. ఆ అమ్మాయి వరస చూస్తే ఏదో లేచి వచ్చిన బాపతేమో, ఎవడో తీసుకొచ్చి ఎక్కడ సెకండ్ సెటప్ పెట్టాడేమో అని ఒక అనుమానం వచ్చింది. అలా ఎవడో తీసుకొచ్చి పెడితే వాడే వచ్చి పోవాలి కాని ఇలా రోజుకో కొత్తవాళ్ళు రావడం ఏమిటని మరో ఆలోచన.

"మా ఆయన స్నేహితులు కుదిర్చారు ఇల్లు. ఆళ్లెవరో నాకు తెలీదు" అంది.

"ఇదిగో చూడు. యింకో రెండు రోజులలో డబ్బు కట్టకపోతే నీళ్ళు, కరెంటు బంద్ చేస్తాం. మా రూలు ప్రకారం...నీ మొగుడ్ని సెక్రటరీకి చూపించకపోతే యిక్కడ వుండనీయం. ఇంటి ఓనర్స్‌కి కంప్లైంట్ చేసి ఖాళీ చేయిస్తాం జాగ్రత్త. ఇలా ప్రతి వాళ్లని అర్ధరాత్రి బిల్డింగులోకి రానీయవద్దని వాచ్‌మెన్‌కి ఆర్డరిచ్చాం" అని చాలా గట్టిగానే చెప్పాను. "చూద్దాం యింకా రెండు రోజులాగి ఓనర్‌కి చెపుదాం" అని అందరితో చెప్పి పంపాను.

ఇలా బెదిరించినా ఆ సాయంత్రం ముస్తాబై తను బయటికి వెళ్లిపోయి తెల్లారి ఐదు గంటలకి తిరిగి వచ్చిందట. వెంట మరో అమ్మాయిని కూడా తీసుకొచ్చింది. రెండు రోజులు గడిచినా డబ్బు కట్టలేదు అసోసియేషన్‌కి. మరోసారి సూపర్‌వైజర్ వెళ్లి అడిగినా ఆయన లేడు అంటూ పాతపాటే. ఆ వార్నింగ్ ఇచ్చాక రెండు రోజులు ఆ అమ్మాయిలిద్దరూ ముస్తాబయి ఏ అర్ధరాత్రో కొంపకి చేరేవారు. అలా రెండు రోజులయ్యాక నీళ్లు, కరెంట్ బంద్ చేశాం. అదే మామూలు వాళ్లయితే వచ్చి మాట్లాడి ఏదో కడ్తాం అలా కట్ చేయవద్దు అని చెప్పి మాట్లాడేవారు. ఆ అమ్మాయి ఏం అనలేదు. కింద నుంచి రెండు బక్కెట్లు నీళ్ళు తెచ్చుకునేది. రాత్రంతా ఇంట్లో వుండేదికాదేమో! కరెంట్ కట్ చేసినా పెద్ద తేడా కనపడలేదనుకుంటాను. కనీసం ఎవరిని వచ్చి టైమివ్వమనైనా అనకపోవడంతో మా అనుమానం బలపడింది. ఆ అమ్మాయి ఫ్యామిలీ టైపు కాదు. ఎవడో తీసుకొచ్చి ఇక్కడ ఇల్లు కుదిర్చి పెట్టి వెళ్లాడు అన్నది అర్థమయింది. ఫ్యామిలీలుండే చోట యిలాంటివి ఎలా సాగనిస్తాం. మీటింగు పెట్టి ఓనర్‌కి ఫోను చేశాం. అతను తనకేం తెలీదు. ఎవరో ఎమ్మెల్యే తాలూకు వాడినంటూ ఫోను చేసి ఇల్లు నా బంధువులకంటే అద్దెకిచ్చాను. అది కూడా ఓ బ్రోకర్ కుదిర్చాడు. నాకేం తెలీదు, ఎవరో ఏమిటో?" అన్నాడు. "ఇలాంటివాళ్లని తెచ్చి సంసారులుండే చోట పెడతావా? అద్దెకిచ్చే ముందు చూడద్దా? ముందు ఖాళీ చేయించు" అని కేకలు వేశాం. "మీరే అసోసియేషన్ తరపున ఏక్షన్ తీసుకుని ఖాళీ చేయించండి. నాకేం అభ్యంతరం లేదు" అన్నాడు ఇంటి ఓనర్.

మేం ఆ అమ్మాయిని ఎలా పంపించాలా అని ఆలోచించే లోపలే ఆ రాత్రి ఇద్దరు గూండాల లాంటి వాళ్ళు ముస్లిముల్లా వున్న ఇద్దరితో కలిసి అర్ధరాత్రి యిద్దరమ్మాయిలు వచ్చారట. వాచ్‌మెన్ వదలకపోతే వాళ్ళిద్దరూ బెదిరించి తంతాం, చంపుతాం అంటూ బెదిరించి వాడ్ని లెక్క



చెయ్యకుండా తీసుకుని లోపలికి వెళ్లిపోయారు. వాచ్‌మేన్ కాస్త తెలివి ఉపయోగించి నెమ్మదిగా బయట గడియపెట్టి వెళ్ళి సెక్రటరీని లేపి చెప్పాడు. "అలా మనుష్యులు లోపలుండగా గడియ పెడితే ఏం గొడవ వస్తుందో? రౌడీల్లా వున్నారంటున్నావు? రేపు అందరం కల్సి ఆలోచిద్దాం, పోలీసులని పిలవచ్చుగాని, మా చుట్టాలంటే మన దగ్గిర ఆధారం ఏముంది? వాళ్ళెవరో, యీ అమ్మాయి బ్రోతల్ అని నిరూపించడానికి. ఇవాల్టికి వదిలేయ్" అన్నాడట సెక్రటరీ.

మర్నాడు సాయంత్రం ఆ అమ్మాయి బయటికి వెళ్లగా చూసి ఆ తాళం మీద తాళం వేయించేశాం. ఆ అమ్మాయిలిద్దరూ తెల్లారి ఐదు గంటలవేళ ఇల్లు చేరారట. తాళం మీద తాళం చూసి వాచ్‌మేన్‌తో దెబ్బలాటకి దిగి రాయి తెచ్చి తాళం బద్దలు కొట్టే ప్రయత్నం చేస్తుంటే వాచ్‌మేన్ అడ్డుకుని అసోసియేషన్ తాళం వేశారు. అది బద్దలు కొడితే చాలా గొడవవుతుంది తెల్లారే వరకు ఆగి వాళ్ళతో వెళ్ళి మాట్లాడండి. ఇపుడు ముట్టుకోడానికి వీలు లేదు అని బెదిరించాడుట. ఇద్దరు అమ్మాయిలు డాబా మెట్లు ఎక్కి కూర్చున్నారట. ఆరు గంటలకి నేను లేవగానే వాచ్‌మేన్ వచ్చి జరిగింది చెప్పాడు.

నేను ఇద్దరం ముగ్గురం ఆడవాళ్లం కల్సి వాళ్లని కిందికి రమ్మన్నాం. వస్తూనే "మా ఇంటి తాళం మీద తాళం ఎందుకు వేశారు?" అంది ఎటాకింగ్‌గా.

"ఎందుకు వెయ్యం? ముందు ఒక సంగతి, మీరు ఇక్కడ మర్యాదస్థుల ఇళ్ళ మధ్య ఇళ్ళు తీసుకుని బ్రోతల్ హౌస్‌గా మారిస్తే వూరుకోం, రెండోది మాకివ్వాల్సిన డబ్బు కట్టకపోతే రూల్సు ప్రకారం తాళం వేసే అధికారం మాకుంది" ఆ అమ్మాయి డబాయింపుకి దిగేసరికి వళ్లు మండి చాలా గట్టిగానే అన్నాను.

"చూడు! మీరు ఆ తాళం బద్దలు కొట్టే పని చేస్తే వూరుకోం, పోలీసు కంప్లైంట్ యిచ్చి మీరు ధంధా చేస్తున్న సంగతి చెప్పి జైల్లో వేయిస్తాం. అట్టే మాట్లాడకుండా మా డబ్బు కట్టి మీ సామాన్లు తీసుకుని మీరు వెళ్లండి. మా ఇంటి వోనరుతో కూడా మాట్లాడాం. మీరిలాంటివారని తెలియదని, మేం ఏం చేసినా తనకేం సంబంధం లేదని మిమ్మల్ని వెళ్లగొట్టమని చెప్పాడు" ఆ అమ్మాయి ఆ దెబ్బతో కాస్త తగ్గింది.

రెండో అమ్మాయి బిక్క మొహం పెట్టి "ఆంటీ! ఒకసారి తాళం తీస్తే నా బట్టలు తీసుకువెళ్లిపోతాను. ఇది యీమె ఇల్లు. నేనూరికే వచ్చానంతే" అంది.

"అదంతా మాకనవసరం. డబ్బు కడితేనే తాళం తీస్తాం. డబ్బు కట్టి వెంటనే ఖాళీ చెయ్యాలి. ఇక్కడొక్క క్షణం వుండనీయం" ఖచ్చితంగా అన్నా. "మీ ఇష్టం వచ్చినట్లు అర్ధరాత్రిళ్ళు మగాళ్లని తీసుకొచ్చి మా బిల్డింగు పరువు తీస్తే చూస్తూ వూరుకుంటామా?" చాలా గట్టిగా డబాయించాను. ఇదంతా హిందీలోనే





మాటలు.

"వాళ్ళు మా చాచాలు, కాకాలు..." రెండో అమ్మాయి ఏదో చెప్పబోయింది. "ఛ! వూరుకో. వాళ్ళేం నమ్మరులే ఆ మాటలు" మొదటి అమ్మాయి కసిరింది. రెండో అమ్మాయి ఏడుపు ఆరంభించింది. "నేను రానంటే కల్సి వుందాం రమ్మన్నావు. నా బట్టలు, వస్తువులు వుండిపోయాయి. ఎలా ఇప్పుడు?" అంటూ దుయ్యబట్టింది. మొదటి అమ్మాయి మొహం గంటుపెట్టుకుంది. "రేపాక రోజు టైమియ్యండి. ఎల్లుండి కడ్తాం డబ్బు" అంది రాజీకొస్తూ.

"ఎల్లుండే తాళం తీస్తాం. తాళం తీసాక సామాను తీసుకు వెంటనే వెళ్లాలి డబ్బు తెచ్చాక మాట్లాడు" పొద్దుటే పనివేళ. వాళ్ళతో యింక వాదించే టైము లేక అందరం లోపలికెళ్లాం. ఇద్దరమ్మాయిలు ఆ రెండో అంతస్తు మెట్ల మీద కూర్చుని మాట్లాడుకుంటూ, కళ్ళు తుడుచుకుంటూ కూర్చున్నారు.

ఓ గంటా రెండు గంటలు పోయాక కాఫీ అదీ తాగి కాస్త పని చేసుకుని బయటికి తొంగి చూసేసరికి వాళ్ళక్కడే కూర్చున్నారు. ఒక్క క్షణం జాలేసింది. అప్పటికప్పుడు పాపం పొమ్మంటే ఎక్కడికి పోతారు? బట్టలవి యింట్లో వుండి పోయాయి. ఏం చేస్తారు అనిపించి కాస్త బాధ వేసింది. మనసుండబట్టలేక సెకండ్‌ఫ్లోర్‌పైపు వెళ్లాను. నే వెళితే కాస్త ఆశగా చూశారు. మొదటి అమ్మాయి ఏదో అనబోయింది. "చూడమ్మాయి, చూస్తే పట్టుమని ఇరవై ఏళ్లున్నట్లు లేవు. నీవెందుకిలాంటి పనులు చేస్తున్నావు? ఇలా వళ్లమ్ముకునే పనికి దిగడం ఎంత నీచం" అన్నాను.

ఆ అమ్మాయి చురచుర చూసింది. "మరి

## మరో వివాదం

వివాదాల్లో చిక్కుకోవడం, ప్రియులను మార్చడంలో మహా బిజీగా ఉన్న అమీషా ఇప్పుడు అక్షయ్‌కుమార్‌తో లిప్‌టులిప్‌కిస్ ఇచ్చి మరో వివాదంలో చిక్కుకుంది. 'మేరే జీవన్ సాథీ' చిత్రంలో అక్షయ్ సరసన నటిస్తున్న అమీషా డైరెక్టర్ కట్ చెప్పిన తరువాత కూడా చాలాసేపు, అతన్ని వదలకుండా ముద్దు పెట్టుకుందట. అమీషా మరో వివాహితుడైన హీరోని తన బుట్టలో వేసుకోవడానికి ప్రయత్నిస్తోంది. (ట్వింకిల్ బీ కేర్ ఫుల్)

## తెలివి

బిపాసాబసు, డినోమోరియాల ప్రేమాయణం పటాపంచలైనప్పటికీ వారిద్దరూ ఆ విషయం బయటకు తెలియకుండా జాగ్రత్త పడుతున్నారు. బిపాసా జాన్ అబ్రహాంతో పీకలలోతు ప్రేమలో మునిగి తేలిన విషయం బాలీవుడ్ అంతా గుప్పుమన్నా, ఏమీ ఎరగనట్టు నటిస్తున్నారు. అంతేకాదు, తెలివిగా ఇద్దరూ కలిసే 'రాజ్', 'గునాహ్' వంటి చిత్రాల్లో నటిస్తున్నారు. ఎంతైనా యాక్టర్స్ కదా?

"ఏం చెయ్యాలి? ఏం తిని బతకాలి" అంది కోపంగా.

"ఏం నీకెవరూ లేరా? అమ్మా, నాన్నా, [illegible] లేరా? పెళ్ళి చెయ్యలేదా?" నాలోని రచయిత్రి సంగతి తెల్సుకోవాలని కుతూహలపడింది.

ఆ అమ్మాయి ముఖం ముడుచుకుంది. "వున్నారు. అంతా వున్నారు. వాళ్ళకి ఎక్కువై వదిలేశారు"

"అదేమిటి? ఆడపిల్లని అలా గాలికి వదిలేశారా?"

"ఎనిమిది మంది పిల్లలం. అయ్య చచ్చాడు. అమ్మ ఎక్కడ నుంచి తెచ్చి పెడుతుంది. మా పక్కింటి అబ్దుల్ భాయి బొంబాయిలో ఉద్యోగం యిప్పిస్తా అంటే నమ్మి పంపింది ఆడితో, ఆ సచ్చినోడు నన్ను ఎవరికో రెండు వేలకి అమ్మిపోయాడు."

"నీవు ముస్లిమ్‌వా, మాతో హిందూ అని అబద్ధం చెప్పావు, గుజరాతి అన్నావు"

తల దించుకుంది అమ్మాయి. ముస్లిమ్ అంటే ఎవరూ ఇళ్ళు ఈయరు అందుకని" అంది.

"మరి బొంబాయి నుంచి యిక్కడికెలా వచ్చావు?" ఈ కథ వివరాలు తెల్సుకోవాలనిపించి పని కూడా పక్కకి పెట్టి మాటలకి దిగాను.

"ఎందుకిదంతా, తాళం తియ్యండి. రేపు డబ్బు కడతా" నేను మెత్త బడటం చూసి జాలిగా అడిగింది.

"నేను సెక్రటరీతో మాట్లాడి తరువాత చెప్తాను. ముందు అంతా నిజం చెప్పు. బొంబాయి నుంచి ఎలా వచ్చావు?"

"నన్ను కొన్న ఆంటీ ఇద్దరు ముగ్గురు అమ్మాయిలను బెంగుళూరు పంపించి బట్టిలిప్పించి నైట్ క్లబ్బులో డ్యాన్స్ చేయడానికి డాన్సు నేర్పించింది. కొన్నాళ్లకి డ్యాన్సులు చేస్తుంటే పోలీసులు ఓ నాడు రైడ్ చేసి పట్టుకుని జైల్లో పెట్టారు. నాలుగు తన్ని డబ్బులు కట్టేవారు లేక వదిలేశారు వాళ్లు. అక్కడ ఇంకొకడు తగిలి "నాతో హైదరాబాదురా, నా దగ్గిరుండువు" అన్నాడు. వాడెవడో డబ్బున్న వాడులాగా వున్నాడు. మార్వాడి అన్నాడు. ఓల్డ్ సిటీలో బిజినెస్ అన్నాడు. ఏం చెయ్యాలి? ఎక్కడికి పోవాలో తెలియక ఆడితో వచ్చేశాను. ఓల్డ్ సిటీలో ఓ ఆరు నెలలు ఓ రూము తీసి పెట్టాడు నన్నక్కడ. కావాల్సివచ్చినప్పుడు వచ్చిపోయేవాడు. ఆడి మోజు తీరాక రావడం మానేశాడు. ఆడు చెప్పాడని ఇంకెవరో మగాళ్ళు వచ్చిపోయేవారు. బతకాలి గదా, డబ్బు కావాలి గదా! నేనింకేం చెయ్యాలి" జవాబియ్యి అన్నట్లు చూసింది.

"నీకేం చదువుకోలేదా" అన్నాను.

నవ్వింది.

"చదువు! తిండికే లేనపుడు సదువెక్కడ? మా బాబా బతికుండగా స్కూలుకెళ్ళేదాన్ని, ఐదో క్లాసు దాకా చదివా. అయ్యపోయాక అమ్మ చదువు మాన్పించి, పనికి పెట్టింది.

"మరి యిక్కడికెలా వచ్చావు? మూడు వేలు అద్దె, ఏడాందల మెయిన్‌టెనెన్స్ ఇవన్నీ కట్టేంత సంపాదనుందా? ఇక్కడ అద్దెకి దిగావు మరి, ఇలాంటి ఇళ్ల మధ్య వూరుకుంటారనే వచ్చావా?"

"ఎవడో బ్రోకర్ కుదిర్చాడు. ఇలా సంసారుల మధ్య వుంటే, ఫ్యామిలి టైపని నమ్మి మగాళ్ళు ఇష్టపడతారని, ఇల్లు, మంచాలు అవి చూసి ఫ్యామిలీ టైపంటే మోజుంటుంది. నీ సంపాదనలో నెలకింత యియ్యాలి. నే కష్టమర్లని పంపిస్తూ వుంటానని మాట్లాడి పెట్టాడు. వాడే ఇంటి ఓనర్‌తో మాట్లాడి అడ్వాన్స్ కట్టాడు."

"మరి వాడినే అడిగి మెయిన్‌టెనెన్స్ కట్టకపోయావా? ఏం డబ్బులు సంపాదిస్తున్నావు ఏడాందలు లేకుండా వున్నావా?" అన్నా.

"ఏం సంపాదన వంద, రెండొందలు యిస్తారు వెధవలు," ఏడ్చుకుంటూ మాట్లాడింది కసిగా.

ఆ అమ్మాయి ఈ రెండు మూడేళ్ళలోనే ఎంత రాటుదేలిందో అర్థమైంది. ఇరవైఏళ్ల అమ్మాయి పట్టుమని పదహారేళ్ళకే ఇలాంటి జీవితంలోకి నెట్టబడి బతుకు తెరువుకి వళ్ళమ్ముకునే స్థితికి పరిస్థితులు లాగినందుకు బాధ, జాలి కల్గింది. ఓ ఆడపిల్ల కడుపు కోసం తన వాళ్ళున్నా తనబతుకు తనతోవ చూసుకోవాల్సి రావడం, దానికి కారణమైన పేదరికం...కన్న తల్లికూడా పట్టించుకోకుండా వదిలెయ్యడం, డబ్బు కోసం పిల్లని నిర్దాక్షిణ్యంగా అమ్ముకోడం...ఇలాంటి కథలు ఎన్నెన్నో రోజుకి జరుగుతుంటాయి. ముఖ్యంగా ముస్లిమ్ బీదకుటుంబంలో మొగాళ్ళు రెండు, మూడు పెళ్ళిళ్ళు చేసుకుని డజన్లకొద్ది పిల్లలని కనడం, డబ్బులకి అమ్మడం, అరబ్ దేశాలకి పెళ్లి పేరుతో ఎవడితోనో పంపడం, ఇలాంటి వార్తలన్నీ పేపర్లలో చదువుతూనే వుంటాం. యిలాంటి అమ్మాయిలని ఎవరాదుకుంటారు? ప్రభుత్వం ఆదుకోవాలి. అలాంటి హోములలో పెట్టిన పిల్లలు ఆ కట్టడిలో వుండలేక, తిండి సరిగ్గా దొరక్క, స్వేచ్ఛ కోసం పారిపోయి ఇలాంటి జీవితాలే ఎన్నుకుంటుంటారు. ఈ బతుకు ఇంతే...పోనీ ఈ ఒక్క రోజుకే తాళం తీసి బట్టలవి తీసుకోనిస్తే, జాలనిపించి వెళ్ళి సెక్రటరీతో మాట్లాడాను. "మనం జాలిపడి తాళం తీస్తే డబ్బులివ్వరు. పదిరోజుల బట్టి చీకట్లో నీళ్ళు లేకుండా వుందిగాని డబ్బిచ్చిందా? అయినా తెలిశాక కూడా ఇలాంటి వాళ్ళని ఇంకా వుండనిస్తే అందరూ మనల్ని అంటారు యాక్షన్ తీసుకోలేదని. ఇంత స్ట్రిక్ట్‌గా వుండకపోతే డబ్బు కట్టరు" అన్నాడు. అదీ నిజమే. రూల్సు రెగ్యులేషన్స్ పాటించాలిగదా! అలా పదిగంటల వరకు మేం దయదల్చి తాళం తీస్తామేమోనన్నట్లు కూర్చున్నారు. తరువాత ఇంక లాభం లేదనుకుని లేచి వెళ్ళిపోయారు.

✳ ✳ ✳

పది పదిహేను రోజుల తరువాత ఎవరో యిద్దరు కుర్రాళ్ళని వెంటబెట్టుకు వచ్చింది. ఈ లోగా వాళ్ళు వెళ్ళిన ఓ రెండు మూడు రోజులకు ఆ ఇంట్లో అమ్మాయిలు ఏమయ్యారంటూ రాత్రిళ్ళు మగాళ్ళు వస్తూనే వున్నారు. వాచ్‌మెన్ తిట్టి ఆ అమ్మాయి ఇల్లు ఖాళీ చేసింది అని చెప్పాక రాకలు తగ్గాయి. డబ్బు కట్టి తాళం తీయించుకుని సామాన్లు ప్యాక్ చేసుకుని తీసుకువెళ్ళిపోయింది. వెళ్ళే ముందు "ఎక్కడికి వెళ్తున్నావు" అన్నా వుండబట్టలేక. నా వంక నిర్లక్ష్యంగా చూసి "ఓల్డ్ సిటీకి మీలాంటి మర్యాదస్తులుండే చోటికి కాదు లెండి" అంది వ్యంగ్యంగా. ఆ వ్యంగ్యంలో హేళన కంటే బాధ వుందని అనిపించింది. ❀

## భయం

*మనీషా కొయిరాలా దర్శకులను భయపెడు తోంది. 'ఏక్ ఛోటీసీ లవ్ స్టోరీ' ద్వారా మనీషా లేవనెత్తిన వివాదం బాలీవుడ్ దర్శకులు ఇంకా మర్చిపోయినట్లు లేరు. అందుకే 'మార్కెట్' దర్శకుడు మనీషాను సెక్సీగా సీన్ తియ్యడానికి ఆమె అనుమతి తీసుకున్నాడు. మొత్తానికి మనీషా బాలీవుడ్‌ను ఒక ఊపు ఊపింది. (వెల్ మనీషా)*

